



కాత్యాయని అభయ ప్రదాయిని



జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన మంగళవారం భ్రమరాంబాదేవి వేదికలో ఖడ్గం ధరించి భక్తజనులకు అభయ ప్రదాయినిగా సాక్షాత్కరించారు. పరమేశ్వరుడు శిరస్సుపై చంద్రవంకను ఆభరణంగా ధరించి ఇష్టసఖి పార్వతి వెంట ఆసీనులయ్యారు.

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే



మద్యం టెండర్లకు నేడు చివరి గడువు

● 105 దుకాణాలకు 967 దరఖాస్తులు



టెండర్లు వేయడానికి వచ్చిన గుత్తేదారులు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల జిల్లాలో ప్రైవేటు మద్యం దుకాణాల నిర్వహణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ బుధవారం సాయంత్రంతో ముగియనుంది. ఈనెల 1 నుంచి 8వ తేదీ వరకు 105 దుకాణాలకు 967 టెండర్లు వేశారు. బుధవారం పెద్దఎత్తున టెండర్లు వేసే అవకాశం ఉన్నట్లు ఎక్సైజ్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆళ్లగడ్డ, బనగానపల్లె, నంద్యాలలో కొంతమంది పోటాపోటీగా టెండర్లు వేస్తున్నారు. దీంతో జిల్లాలో 2 వేల వరకు టెండర్లు దాఖలయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దుకాణాల కేటాయింపునకు ఈనెల 11న కలెక్టర్ కార్యాలయంలో లాటరీ తీయనున్నారు.

జగన్నాటకానికి తెర

■ రాజోలి, జొలదరాశి జలాశయాలు లేనట్లే

■ అలగనూరు మరమ్మతులపై దృష్టి



రాజోలి.. జొలదరాశి జలాశయాలు నిర్మిస్తాం.. కుందూనదిని విస్తరించి వరద ముప్పు తప్పిస్తామంటూ ఐదేళ్లు గొప్పలు చెప్పిన గత వైకాపా ప్రభుత్వం అమలు దిశగా ఒక్క అడుగు వేయలేదు. ఐదేళ్ల అధికారంలోకి వచ్చిన 'కూటమి' ప్రభుత్వం పూర్తిగా 25 శాతం దాటని సాగునీటి ప్రాజెక్టుల వివరాలు సేకరించింది. నిర్మాణం మొదలు కాని రెండు జలాశయాలకు సంబంధించి 1400 ఎకరాలకుపైగా భూములు రెడ్‌మార్కులో ఉన్న విషయాన్ని గుర్తించింది. పనులను రద్దు చేసి భూములపై రెడ్‌మార్కు తొలగించాలని భావిస్తున్నట్లు తెలిసింది. వీటికి బదులుగా అలగనూరు జలాశయానికి మరమ్మతులు చేసి కుందూనదికి సాగునీరు మళ్లించే దిశగా ఆలోచన చేస్తున్నారు.

నంద్యాల పట్టణం, కోవెలకుంట్ల, చాగలమర్రి న్యూస్‌టుడే :

పునాది కూడా వేయలేదు

● బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్ నుంచి వైఎస్సార్ జిల్లా జమ్ములమడుగు సమీపంలోని పెన్నానది వరకు 187 కి.మీ మేర కుందూనదిని విస్తరించడంతో పాటు.. కుందూ వరద నీటిని కేసీ ఆయకట్టుకు మళ్లించి 91 వేల ఎకరాలను స్థిరీకరించడమే లక్ష్యంగా రాజోలి, జొలదరాశి జలాశయాలను నిర్మిస్తామని జగన్ గొప్పలు చెప్పారు.

● రాజోలి, జొలదరాశి ప్రాజెక్టులకు పునాది వేయలేదు. కుందూ ఆధునికీకరణ పనులు 20 శాతం మేర చేశారు. ఇందుకు సంబంధించి గుత్తేదారు సంస్థకు నాటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులను నిలిపేశారు.

● రాజోలి, జొలదరాశి జలాశయాల కోసం వేల ఎకరాల భూములు సేకరించినా ఇంత వరకు రైతులకు పైసా పరిహారం చెల్లించలేదు. ఈ భూముల క్రయ, విక్రయాలు కూడా జరగకుండా రెడ్‌మార్కులో ఉంచారు.

భూ సేకరణ మాయ

● జిల్లాలోని బనకచర్ల వద్ద ఉన్న నిప్పులవాగు నుంచి వైఎస్సార్ జిల్లా ఆదినిమ్మాయపల్లె వద్ద ఆనకట్ట వరకు 189 కి.మీ.ల పొడవున కుందూనదిని రూ.1725 కోట్లతో విస్తరిస్తున్నట్లు వైకాపా ప్రభుత్వం ప్రకటించింది. టెండర్లు పిలిచి గుత్తేదారు సంస్థకు పనులు అప్పగించింది. ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతాల్లో మాత్రమే 20 శాతం పనులు జరిగాయి. చేసిన పనులకు ప్రభుత్వం ఒక్క పైసా బిల్లులు చెల్లించలేదు.

● పాములపాడు, వెలుగోడు, బండిఆత్మకూరు, నంద్యాల, పాణ్యం, గోస్పాడు, కోవెలకుంట్ల, బనగానపల్లి, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు, చాగలమర్రి మండలాల్లో 5 వేల ఎకరాల వరకు ప్రైవేటు భూములను సేకరించాల్సి ఉంది. ఎకరం కూడా సేకరించలేదు. దీంతో కుందూను ఆధునికీకరించి 3 టీఎంసీల నీటిని తరలించాలన్న లక్ష్యం నీరుగారిపోయింది.

అన్నదాతల అవస్థలు

▶ కుందూనదిపై కోవెలకుంట్ల మండలం జొలదరాశి వద్ద, చాగలమర్రి మండలం రాజోలి వద్ద రెండు ప్రాజెక్టులను నిర్మించాలని నాలుగేళ్ల కిందట అప్పటి సీఎం జగన్ మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. భూ సేకరణ కూడా చేశారు.

▶ జొలదరాశి రిజర్వాయరు ఎకరాకు రూ.15 లక్షల పరిహారం చెల్లిస్తామని 627 ఎకరాలు సేకరించారు. రాజోలి జలాశయానికి ఎకరాకు రూ.12.50 లక్షలు చెల్లిస్తామని 766 ఎకరాల భూములు తీసుకున్నారు.

▶ ఇంతవరకు పరిహారం ఇవ్వకపోగా సేకరించిన భూములను రెడ్‌మార్కులో ఉంచారు. దీంతో జొలదరాశి, కోవెలకుంట్ల, వల్లంపాడు, చింతకుంట, పెద్ద కొప్పెర్ల, ఉప్పలూరు, కలుగొట్ల, రేవనూరు, చిన్న కొప్పెర్ల, గోవిందిన్నె, ఎస్. కూలూరు, వెలుగటూరుతో పాటు చాగలమర్రి మండలం గొట్లూరు, రాజోలి, ఉయ్యాలవాడ మండలం కాకరవాడ, ఆర్. జంబులదిన్నె గ్రామాల రైతులు పంట రుణాలూ తీసుకోలేని దుస్థితి దాపురించింది.

రుణాలు ఇవ్వడం లేదు : మొదుళ్ల శ్రీనివాసరెడ్డి, కలుగొట్ల

తొలి విడతలో 8.5 ఎకరాల పొలం జలాశయం నిర్మాణంలో పోయింది. ఎకరాకు రూ.14.75 లక్షలు ఇస్తామని చెప్పిన గడువు వచ్చే ఏప్రిల్ నాటికి మూడేళ్లు పూర్తవుతోంది. ఇప్పటికీ పరిహారం అందలేదు. డబ్బులు వస్తాయనే ఆశతో అప్పులు చేసి మరీ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నా. పరిహారం రాక పిల్లల చదువులకు ఇబ్బందిగా ఉండటంతో మార్ట్‌గేజ్ రుణానికి బ్యాంకుకు వెళ్తే రెడ్‌మార్క్‌లో ఉన్నందున అప్పులు ఇవ్వలేమన్నారు. రైతులంతా కలిసి మూడుసార్లు జిల్లా కేంద్రంలోని 'స్పందన'లో అర్జీలు ఇచ్చాం. పరిహారం చెల్లించడానికి చర్యలు తీసుకోవాలి.

కుమార్తె పెళ్లికి రూ.30 లక్షలు అప్పు

- శివారెడ్డి, గొట్లూరు

రాజోలి జలాశయం నిర్మాణానికి 2.5 ఎకరాల భూమిని కోల్పోయా. మూడేళ్ల కిందట అధికారులు సంతకాలు తీసుకున్నారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. ముగ్గురు కుమార్తెలు. ఈ ఏడాది ఆగస్టులో రెండో కుమార్తె పెళ్లి చేశా. పొలాన్ని అమ్ముకోలేకపోతున్నా. రూ.30 లక్షల్ని రూ.2ల వడ్డీ చొప్పున అప్పు చేసి కూతురి పెళ్లి చేశా. నెల నెలా వడ్డీ భారం ఎక్కువవుతోంది. పరిహారం ఇంకా అందలేదు. క్రయ విక్రయాలైనా జరిగితే పొలం అమ్మి అప్పులు చెల్లించాలనుకుంటున్నా.

పల్లెల్లో ప్రగతి పండుగ

■ సీసీరోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం

■ ఈ నెల 14 నుంచి 21 వరకు శంకుస్థాపనలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పల్లెలను గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఆర్థిక సంఘం నిధులను పథకాలకు మళ్లించింది. ఫలితంగా గ్రామాల్లో కనీస వసతులు కరవయ్యాయి. కనీసం పారిశుద్ధ్య పనులు చేయలేని పరిస్థితి. సర్పంచులు తమ సొంత నిధులు ఖర్చు చేశారు. బిల్లులు రాక అప్పలపాలయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గ్రామాలకు మంచిరోజులు వచ్చాయి. ఉపాధి నిధులతో రహదారులు, ఇతర సౌకర్యాలు సమకూర్చేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 1,026 పనులకు రూ.85.85 కోట్లు వెచ్చించనున్నారు.

గ్రామసభల్లో గుర్తించి

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకునేందుకుగాను ఆగస్టు 23వ తేదీన గ్రామసభలు నిర్వహించారు. ఈ సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను పాలకులు, అధికారులు గుర్తించారు. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. ఇందులో భాగంగా ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు 'పల్లె పండగ' నిర్వహించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రతి గ్రామంలో రహదారులు, కాలువలు, ఇతర వసతులు కల్పించేందుకు శంకుస్థాపలు చేయాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది సంక్రాంతి పండగకు రహదారుల పనులు పూర్తి చేసి మరో పండగ నిర్వహించేలా ప్రభుత్వం లక్ష్యాలు విధించింది.

నియోజకవర్గం	చేపట్టనున్న పనులు	మంజూరైన నిధులు (రూ.కోట్లలో)
బనగానపల్లి	145	20.00
డోన్	64	7.45
నంద్యాల	103	7.80
పాణ్యం	71	5.00
శ్రీశైలం	164	12.12
నందికొట్కూరు	236	15.42
ఆళ్లగడ్డ	240	13.47

పట్టణాల సుందరీకరణపై ప్రత్యేక దృష్టి


సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో మున్సిపాలిటీల్లో సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ జి.రాజకుమారి పుర కమిషనర్లను ఆదేశించారు. అన్న క్యాంటీన్లు, 200 రోజుల ప్రణాళిక, పట్టణ సుందరీకరణ, శానిటేషన్, మంచినీటి సరఫరా తదితర అంశాలపై మంగళవారం సమీక్షించారు. పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి.. సురక్షిత నీరు అందించాలి.. వంద రోజుల ప్రణాళికలో భాగంగా చేపట్టిన అంశాలను క్షేత్రస్థాయిలో తానే స్వయంగా పరిశీలిస్తానన్నారు. 200 రోజుల ప్రణాళిక లక్ష్యాల నివేదికలు సమర్పించాలన్నారు. అన్న క్యాంటీన్లను తరచూ తనిఖీ చేయాలి.. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించాలన్నారు. మురుగునీటి శుద్ధీకరణ ప్లాంట్ల ఏర్పాటుకు స్థలాలు సేకరించాలన్నారు. నంద్యాలలో బయోగ్యాస్‌కు అవసరమైన ఐదెకరాల స్థలాన్ని గుర్తించాలన్నారు. ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, పుర కమిషనర్లు ఉన్నారు.

మోగనున్న జలగంట

■ సాగు నీటి సంఘాలకు ఎన్నికలు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో 302 సాగు నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణపై జల వనరులశాఖ మంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో ఆమె మాట్లాడారు. కేసీ కాల్వ కింద 86, ఎస్సార్బీసీ 49, తెలుగు గంగ 47, చెరువుల కింద 120 సంఘాలు ఉన్నాయన్నారు. ఆర్డీవో మల్లికార్జునరెడ్డి, జల వనరుల శాఖాధికారులు పాల్గొన్నారు.

దోపిడీ మార్గం

■ ప్రైవేటు బస్సుల దందా

■ ఇష్టానుసారంగా ఛార్జీల వసూలు

■ తనిఖీలు మరచిన అధికారులు

దసరా నేపథ్యంలో ప్రైవేటు వాహనాలు దోపిడీకి తెర తీశాయి. ప్రయాణికుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని టికెట్ల ధరలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ కరవవడంతో యథేచ్ఛగా దోపిడీకి పాల్పడుతున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా మీదుగా నిత్యం 65 ప్రైవేటు బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. రోజూ సుమారు 3 వేల మందికి పైగా ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు వెళ్తుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత ఛార్జీలు వసూలు చేయాల్సి ఉండగా డిమాండ్ నేపథ్యంలో రెండింతలు వసూలు చేస్తున్నారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే :

చెక్‌పోస్టులు ఎత్తేసిన వైకాపా



కర్నూలు నగర శివారులోని పంచలింగాల, శ్రీశైలం సున్నిపెంట మార్గంలో గతంలో రవాణా శాఖకు సంబంధించిన చెక్‌పోస్టులు ఉండేవి. గత వైకాపా ప్రభుత్వం వీటిని ఎత్తేసింది. ఫలితంగా ప్రైవేటు వాహనాలపై నిఘా కరవైంది. ప్రత్యేక డ్రైవ్‌లు, తనిఖీలు కానరావడం లేదు. ఫిట్‌నెస్ లేని బస్సులు రోడ్డెక్కినా పట్టించుకునేవారే కరవయ్యారు. దసరా, దీపావళి పండగల నేపథ్యంలో రవాణా శాఖ అధికారులు పలు మార్గాల్లో నిరంతరం ప్రత్యేక తనిఖీలు చేయాల్సి ఉంది.. ఎక్కువ మొత్తంలో ఛార్జీలు వసూలు చేసినా.. బస్సులకు ఫిట్‌నెస్ లేకున్నా జరిమానా విధించడం.. వాహనాలు సీజ్ చేయాల్సి ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు.

ప్రాంతం	ఆర్టీసీ		ప్రైవేటు
	సూపర్ లగ్జరీ(రూ.)	ఏసీ(రూ.)	బస్సుల్లో(రూ.)
విజయవాడ	555	671	900-1,250
బెంగళూరు	579	723	890-1,280
చెన్నై	776	-	800-1,235
తిరుపతి	543	686	810-1,300
హైదరాబాద్	344	416	935-1,300

తనిఖీలు నిర్వహిస్తాం

– శాంతకుమారి, ఉప కమిషనర్, జిల్లా రవాణా శాఖ

వాహనాల తనిఖీకి పకడ్బందీ చర్యలు తీసుకుంటాం. రెగ్యులర్ విధులు ముగిసిన తర్వాత రాత్రివేళల్లోనూ ప్రత్యేక డ్రైవ్ చేపడతాం. వాహన సామర్థ్యం సరిగా లేకపోయినా.. వాహన పన్నులు చెల్లించకపోయినా.. ఎక్కువ ఛార్జీలు వసూలు చేసినా జరిమానా విధిస్తాం. ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు అందితే బస్సులు సీజ్ చేసేందుకూ వెనుకాడం.

విధి లేక ప్రైవేటు మార్గం

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు ఉపాధి నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, బళ్లారి తదితర ప్రాంతాల్లో ఉంటున్నారు. ఉపాధి, ఉద్యోగాల నిమిత్తం చాలామంది కర్నూలు నగరంతోపాటు నంద్యాల పట్టణంలో నివసిస్తుంటారు. దసరా పండగ నేపథ్యంలో దాదాపు అందరూ తమ స్వప్రాంతాలకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు ఎక్కువగా బస్సులు నడపాల్సి ఉంది. ఆ దిశగా ఆర్టీసీ అధికారులు దృష్టి సారించకపోవడంతో జనం తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది.

ఆదరణ లభించినా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 12 డిపోల పరిధిలో 966 బస్సులు నడుస్తున్నాయి. ప్రస్తుతం పండగల సీజన్ నేపథ్యంలో ఆర్టీసీ సంస్థ ప్రయాణికుల నుంచి ప్రత్యేక బస్సుల్లో ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడం లేదు. మరో వైపు రానుపోను టికెట్ నమోదు చేసుకుంటే 10 శాతం వరకు రాయితీ ఇస్తోంది. ఈ నేపథ్యంలో రెగ్యులర్ బస్సుల్లో చాలామంది ప్రయాణికులు రిజర్వేషన్లు చేయించుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలో రెగ్యులర్ బస్సులు కాకుండా 60కిపైగా అదనంగా బస్సులు నడుపుతున్నారు. వీటిల్లోనూ రాయితీ సౌకర్యం కల్పించారు. పండగల నేపథ్యంలో సీటన్నీ రిజర్వ్ అయిపోవడంతో చివరికి ప్రైవేటు బస్సులే దిక్కవుతున్నాయి.

టెట్‌కు 38 మంది గైర్హాజరు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని అయ్యలూరి మెట్ట వద్ద ఉన్న ఎస్వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ప్రశాంతంగా జరిగినట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఉదయం 175 మందికి గాను 20, సాయంత్రం 175 మందికి గాను 18 మంది గైర్హాజరైనట్లు వెల్లడించారు.





అర్షద్ ఆత్మవిశ్వాసం అందరికీ ఆదర్శం


అర్షద్‌ను అభినందిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : అర్షద్ ఆత్మవిశ్వాసం ప్రతిఒక్కరికీ ఆదర్శమని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాలకు చెందిన అంతర్జాతీయ స్థాయి పారా అథ్లెట్ అర్షద్‌ను నంద్యాలలోని తన కార్యాలయంలో మంత్రి మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ప్యారిస్‌లో నిర్వహించిన పారాలింపిక్స్‌లో సైక్లింగ్ పోటీల్లో అర్షద్ దేశం తరఫున పాల్గొనడం గర్వకారణమన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి అర్షద్‌కు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐఎంఏ నంద్యాల అధ్యక్ష, కార్యదర్శులు డా.వసుధారాణి, డా.పనిల్, డా.రవికృష్ణ, డా.అనిల్‌కుమార్, లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ ఎంపీవీ రమణయ్య, సభ్యులు శిరిగిరి రమేశ్, సోమేశుల నాగరాజు, శ్రీకాంత్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయం నీటిమట్టం 882.50 అడుగులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయం నీటిమట్టం మంగళవారం సాయంత్రం 6 గంటల సమయానికి 882.50 అడుగులు, నీటినిల్వ 202.0439 టీఎంసీలుగా నమోదైంది. ఎగువ పరీవాహక ప్రాంతాలైనా జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 57,039 క్యూసెక్కుల వరద నీరు శ్రీశైలం జలాశయానికి వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జల విద్యుత్తు కేంద్రాల్లో విద్యుత్తు ఉత్పత్తి చేస్తూ 66,157 క్యూసెక్కుల నీటిని నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు.

కొలను భారతి.. జన హారతి

నేడు సరస్వతిదేవిగా అమ్మవారి దర్శనం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: చదువుల తల్లి సరస్వతి దేవి కొలువుదీరిన కొలనుభారతిలో బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా శరన్నవరాత్రుల్లో ఏడోరోజు అమ్మవారు తన స్వయంభూ అలంకరణలో సరస్వతిదేవిగా దర్శనమివ్వనున్నారు. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఎత్తైన కొండల మధ్యన చారుఘోషిణి నది ఒడ్డున సరస్వతి ఆలయం కొలనుభారతి క్షేత్రంగా నామకరణం పొందింది. చారుఘోషిణి నది వర్ష, వేసవి కాలాలతో సంబంధం లేకుండా ఎల్లప్పుడూ సహజంగా ప్రవహించడం విశేషం. ఇక్కడ అమ్మవారు స్వయంభుగా పుస్తక ధారిణి రూపంలో దర్శనం ఇస్తారు. 11వ శతాబ్దికి చెందిన మల్లభూపతి అనే చాళుక్యరాజు నిర్మించినట్లు శిలాశాసనాలను ద్వారా తెలుస్తోంది. సరస్వతీదేవిని వేదమాతగా, భారతిగా, వాగేశ్వరిగా, శారదగా మన పూర్వికులు అభివర్ణించారు. ఇంతటి శక్తివంతమైన కొలనుభారతి అమ్మవారిని జ్ఞాన స్వరూపిణిగా భావిస్తారు.

చేతిలో వేదాలు

కొలనుభారతిలో కొలువైన సరస్వతి అమ్మవారికి మూలవిరాట్ ఎదురుగా శ్రీచక్రం ఉండటం విశేషం. అంతేకాకుండా అమ్మవారి చేతిలో వేదాలు ధరించి ఉన్న పుస్తాకపాణిగా కనబడుతుంది. నాలుగు కరములు కలిగిన అమ్మవారు ఉత్తర ముఖంగా దర్శనం ఇస్తున్నారు. కుడి రెండు చేతుల్లో పాశం, అభయ హస్తం, ఎడమవైపు రెండు చేతుల్లో పుస్తకం, అంకుశం కనిపిస్తాయి.



కొలనుభారతి క్షేత్రంలో అమ్మవారు



కొలనుభారతి క్షేత్రం సమీపంలో జాలువారుతున్న జలపాతం

రాష్ట్రంలో ఏకైక సరస్వతి క్షేత్రం

కొలనుభారతి ఆలయం అతిపురాతనమైనది. ఉమ్మడి రాష్ట్రం ఉన్న సమయంలో రెండో సరస్వతి క్షేత్రంగా ఉండేది. క్షేత్ర ప్రాశస్త్యం, ఆధ్యాత్మిక విశిష్టత, చరిత్రను బట్టి బాసర సరస్వతి దేవస్థానం కన్నా పురాతన దేవాలయంగా చరిత్రకారులు భావిస్తున్నారు.

తప్పక చూడదగ్గ ప్రాంతం

కొలనుభారతి దేవి సన్నిధిలో అక్షరాభ్యాసం, బీజాక్షరాలు, విద్యాభ్యాసం ప్రారంభిస్తే అత్యున్నత స్థాయికి చేరుకుంటారని భక్తుల విశ్వాసం. అంతేకాక ఈ గుడి ఆవరణలో సప్త శివాలయాలు ఉన్నాయి. పక్కనున్న జల ధార గల గల పారుతూ, పచ్చటి చెట్ల మధ్య నుంచి పక్షులు చేసే శబ్దాలను, ఆ క్షేత్రానికి ప్రారంభంలో ఉన్న అందమైన గోపాల కృష్ణున్ని తిలకించాలంటే ఆ క్షేత్రం తప్పక దర్శించాల్సిందే.

సప్త శివాలయాలు

ఆలయ ఆవరణలో సప్త శివాలయాలు ఉన్నాయి. ఈ శివాలయాల్లో ఒక ఆలయం తూర్పు ముఖం గాను, మిగిలిన మూడు ఆలయాలు దక్షిణం వైపు ఉన్నాయి. నాలుగు ఆలయాలకు ఒకే ధ్వజస్తంభం ఉండటం విశేషం.

క్షేత్రానికి చేరుకోవాలంటే

ఆత్మకూరు నుంచి కపిలేశ్వరం వెళ్లే బస్సులో శివపురం గ్రామం చేరుకోవాలి. లేదా ఆత్మకూరు పాతబస్టాండు నుంచి శివపురం గ్రామానికి వెళ్లే ఆటోలో వెళ్లాలి. శివపురం నుంచి ఐదు కి.మీ. అటవీ మార్గంలో ఆటోలో లేదా నడుచుకుంటూ కొలనుభారతి క్షేత్రం చేరుకోవచ్చును.

టమాటా.. కాసుల పంట

☛ రిటెయిల్ అమ్మకాల్లో కిలో టమాటా రూ.100 పైనే

కళతప్పిన పొలాలు కాసులు కురిపిస్తున్నాయి. దిగుబడులు పోటీపడి దిగొస్తున్నాయి. కుదేలైన కుటుంబాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాయి. ఇంట్లో తిష్టవేసిన కష్టాలు గడపదాటుతున్నాయి. చుట్టూ పేరుకుపోయిన అప్పులు తీరిపోతున్నాయి. ఊహించని ధరలు ఆహ్వానిస్తున్నాయి. లాభాలతో జేబులు నిండుతున్నాయి. వర్షాల తర్వాత కోలుకున్న పంటలు రైతులకు కాసులు కురిపిస్తున్నాయి. దిగుబడులు మెండుగా ఉన్నాయి.. లాభాలు మెరుగయ్యాయి.. రైతుల మోములు ఆనందంతో కళకళలాడుతున్నాయి.

- న్యూస్‌టుడే, పత్తికొండ, మద్దికెర

గండాలు గట్టెక్కి..

గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలతో టమాటా పంట పూర్తిగా దెబ్బ తింది. తర్వాత కోలుకున్న పంటలు రైతులకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. దిగుబడులు మెండుగా వస్తుండటం, ధరలు సైతం అధికంగా ఉండటంతో రైతులకు లాభాలు దరిచేరుతున్నాయి. మరో వారం రోజుల్లో ఈ ధరలు మరింతగా పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. కిలో ధర రూ.200కు చేరినా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం హోల్‌సేల్‌గా మార్కెట్లో రూ.50 నుంచి రూ.60 వరకు ధర లభిస్తోంది. రిటెయిల్ మార్కెట్‌లో కిలో టమాటా రూ.100కు పైగా పలుకుతుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కోతలు, రవాణా తదితర ఖర్చులు పోను.. బాగానే మిగులుబాటు అవుతోందని, ఇది ఇలాగే కొనసాగితే మరింత ఆదాయం సమకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పత్తికొండ నుంచి తెలంగాణ మార్కెట్లకు సరకు

పత్తికొండ టమాటా మార్కెట్ నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్న టమాట దిగుబడులను రోజూ తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల్లోని మార్కెట్లకు తరలిస్తున్నారు. ఆ మార్కెట్లలో ఇక్కడి పంటకు మంచి గిరాకి ఉండడంతో కొనుగోలు చేసిన సరుకును ఏ రోజుకారోజు గ్రేడింగ్ చేసి లారీల్లో తరలిస్తున్నారు. అక్కడ హోల్‌సేల్‌గా రూ.100కు పైగా ధర పలుకుతుండడంతో ఆ మార్కెట్లకే సరుకును పంపుతున్నారు.



పత్తికొండ టమాటా మార్కెట్

దిగుబడి పెరిగితే ఎగుమతి

ప్రస్తుతం దిగుబడులు తక్కువగా ఉండటంతో తెలంగాణ రాష్ట్రంలోని మార్కెట్లకు మాత్రమే సరకు తరలిస్తున్నారు. రైతుల నుంచి దిగుబడి పెరిగితే తమిళనాడులోని చెన్నై, కర్ణాటకలోని హోసూర్, కృష్ణగిరి ప్రాంతాలకు తరలిస్తామని వ్యాపారులు చెబుతున్నారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు పంట పూర్తిగా దెబ్బ తింది. దీంతో దిగుబడులు భారీగా తగ్గాయని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో టమాటా సాగు

సం॥	సాగు విస్తీర్ణం (హెక్టార్లు)	దిగుబడి (మెట్రిక్ టన్నులు)
2019- 20	4,044	1,05,144
2020- 21	4,124	1,07,224
2021- 22	4,244	1,10344
2022- 23	9,163	4,30,454
2023- 24	7,230	2,16,900

పత్తికొండ మార్కెట్‌కు వచ్చిన సరకు (క్వింటాళ్లలో)

ఏ రోజు	వచ్చిన సరకు	కనిష్ఠ ధర	గరిష్ఠం	మధ్య ధర
గతనెల 29	742.55	రూ.2,600	రూ.4,500	రూ.3,200
30	754.95	రూ.2,600	రూ.4,500	రూ.3,300
ఈ నెల 01	546.55	రూ.2,500	రూ.4600	రూ.3,400
02	533.85	రూ.3,000	రూ.5,200	రూ.3,500
03	563.3	రూ.2,700	రూ.5,000	రూ.3500
04	550.6	రూ.3,000	రూ.6000	రూ.4,000
05	551.2	రూ.2,500	రూ.5,500	రూ.4,000
06	570.9	రూ.2,600	రూ.5,400	రూ.4,000

ఇప్పుడిప్పుడే పెట్టుబడి అందుతోంది

- మహబూబ్‌బీ, రైతు, రాతన

నేను ఎకరం పొలంలో టమాటా సాగు చేశా. గత నెలలో అధిక వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతిని, ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. దీనికి తోడు ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టా. దిగుబడులు తగ్గినా.. ధరలు ఇలాగే కొనసాగితే నష్టం నుంచి పూర్తిగా బయటపడతాం.

ధరలు కొనసాగితేనే..

- లచ్చమ్మ, రైతు, కురవలదొడ్డి

ఏటా మూడెకరాల్లో టమాటా సాగు చేస్తా. ఈ సారి కూడా మూడెకరాల్లో సాగు కోసం రూ.1.15 లక్షలు వెచ్చించా. ఇప్పుడిప్పుడే దిగుబడులు పెరిగాయి. ఈ రోజు 12 గంపలు మార్కెట్‌కు తెచ్చా. కిలో రూ.50 చొప్పున ధర పలికింది. అన్ని ఖర్చులు పోను రూ. 5వేలు మిగిలింది. ఇప్పటి వరకు వచ్చిన సొమ్ము ఖర్చులకే సరిపోయేది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే మరింత లాభాలు వస్తాయి.

రెండూ ఆశాజనకంగా ఉన్నాయి

- ఈరన్న, టమాటా రైతు, పెరవలి

ప్రస్తుతం పంట దిగుబడులు, మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. మూడెకరాల్లో టమాటా సాగుకు రూ.90 వేలకు పైగా ఖర్చుచేశా. రెండు నెలల పాటు దిగుబడులు బాగా వచ్చినా.. ధరలు పూర్తిగా పతనమయ్యాయి. ఇప్పుడిప్పుడే ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. ఈ ధరలతో టమాటా రైతులందరూ సంతోషంగా ఉన్నారు. ఇదే ధరలు డిసెంబర్ వరకు కొనసాగితే ప్రతి రైతుకు మేలు జరుగుతుంది.

పల్లె పండగలో అభివృద్ధికి శ్రీకారం

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు వారం రోజుల పాటు నిర్వహించనున్న పల్లె పండగ కార్యక్రమంలో నిర్దేశించిన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాలని కలెక్టర్ జి.రాజకుమారి పంచాయతీ రాజ్, డ్వామా అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయం నుంచి పల్లె పండగ కార్యక్రమం నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కల్యాణ్ జిల్లా కలెక్టర్‌తో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డ్వామా పీడీ జనార్దన్‌రావు, పంచాయతీ రాజ్ ఎస్ఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, జడ్పీ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి తదితరులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లె పండగ కార్యక్రమంలో సుమారు రూ.90 కోట్లతో మంజూరు చేసిన 1024 పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రికి తెలిపారు. ఉపాధిహామీ నిధుల అనుసంధానంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్లు, బీటీ రోడ్లు తదితర పనుల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. పరిపాలన ఉత్తర్వులు జారీ చేసిన పనులకు వారం రోజుల్లో శంకుస్థాపనలు చేసి త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

కనక దుర్గా అమ్మవారికి మంత్రి బీసీ పూజలు

బనగానపల్లి, న్యూస్‌టుడే : దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం హైదరాబాద్‌లోని అమీర్‌పేట శ్రీ కనకదుర్గా అమ్మవారి ఆలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ఆవరణలో ప్రత్యేక హోమం ఏర్పాటు చేశారు. అమ్మవారికి ప్రత్యేక కానుకలు సమర్పించారు.



అమ్మవారి ఆలయంలో పూజలో పాల్గొన్న మంత్రి బీసీ దంపతులు

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

ఆత్మకూరు, న్యూస్‌టుడే: జిల్లాలోని 6 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలోని అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి, సాధికారత అధికారిణి లీలావతి మంగళవారం తెలిపారు. జిల్లాలో మెయిన్ అంగన్‌వాడీ-6, మినీ అంగన్‌వాడీ-2, అంగన్‌వాడీ ఆయాలు 60 ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. 21-35 ఏళ్లలోపు వయసు కలిగిన స్థానిక వివాహితులు అర్హులని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో 21 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు లేకపోతే 18 సంవత్సరాలు నిండిన వారిని పరిగణలోకి తీసుకుంటారని వివరించారు. దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ పత్రాలు జతపరిచి సీడీపీవో కార్యాలయంలో ఈ నెల 10 నుంచి 21వ తేదీలోపు సమర్పించాలన్నారు.

మల్లన్నసేవలో సినీనటుడు గోపీచంద్

శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే: శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లను సినీనటుడు గోపీచంద్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయన స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అర్చకులు వేదాశీర్వచనాలు పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



స్వామిఅమ్మవార్లను దర్శించుకున్న సినీనటుడు గోపీచంద్

డ్రిప్ పథకం కింద రూ.204 కోట్లతో పనులు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయాన్ని ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు, సీడబ్ల్యూసీ అధికారుల బృందం ఆనకట్టను మంగళవారం పరిశీలించింది. ప్రతినిధుల బృందంలోని సభ్యులు ముక్కాల రమేష్, రాజగోపాల్ సింగ్, ఆండీ జెలన్‌స్కీ, హేనీ సాలెం ఆనకట్ట డౌన్ స్ట్రీమ్ ఎప్రాన్‌ను, ప్లంజ్‌పుల్‌ను పరిశీలిచారు. 2009 వరదల సమయంలో కొట్టుకుపోయిన అప్రోచ్ రోడ్డు, ప్లంజ్‌పుల్(గొయ్యి)లతో పాటు ఆనకట్ట సమస్యలను బృందం సభ్యులకు కర్నూలు చీఫ్ ఇంజినీరు కబీర్‌బాషా, ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి వివరించారు. శ్రీశైలం ఆనకట్ట మరమ్మతుల నిర్వహణకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం డ్రిప్ పథకం కింద మంజూరు చేయడానికి సన్నాహాలు చేపట్టారు. డ్రిప్ పథకం కింద రూ.204 కోట్లతో రెండు విడతలుగా పనులు చేయనున్నట్లు సీఈ కబీర్‌బాషా తెలిపారు. తొలి విడతగా రూ.103 కోట్లతో పనులు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న బృందం సభ్యులు

భార్యను హతమార్చిన వ్యక్తికి జీవిత ఖైదు

గోస్పాడు, న్యూస్‌టుడే : మండలంలోని ఎం.కృష్ణాపురానికి చెందిన నాగమ్మను హత్య చేసిన కేసులో భర్త నేస బాలఓబన్నకు ఆళ్లగడ్డ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి జీవిత ఖైదు విధించినట్లు ఎస్సై వెంకటప్రసాద్ మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఎం.కృష్ణాపురానికి చెందిన నాగమ్మ (46), బాల ఓబన్న దంపతుల మధ్య కుటుంబ కలహాలు జరిగేవి. ఈ క్రమంలో 2022 ఏప్రిల్ 6న తెల్లవారుజామున నిద్రిస్తున్న నాగమ్మను భర్త గొడ్డలితో నరికి చంపారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. కోర్టు విచారణలో నేరం రుజువుకావడంతో బాల ఓబన్నకు జీవిత ఖైదు, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారని ఎస్సై వివరించారు.

సామూహిక అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: భర్తతో కలిసి వెళ్తున్న ఓ వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఓ ముఠాలోని ఇద్దరికి 20 ఏళ్లు, మరొకరికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ గుంటూరు ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి కె.నీలిమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రం నంద్యాల పట్టణం సమీపం చినకుదురుకు చెందిన ఆకుల లింగమయ్య, దాసరి ఓబులేశు, ఇండ్ల రమణ, దాసరి సుంకన్నతో పాటు మరో మైనర్ రాష్ట్ర వ్యాప్తంగా పలు నేరాలకు పాల్పడ్డారు. దారి దోపిడీలకు పాల్పడి మహిళలపై దాడులు చేసేవారు. 2021 సెప్టెంబరు 8న పల్నాడు జిల్లా సత్తెనపల్లికి చెందిన భార్యాభర్తలు మేడికొండూరు సమీపంలోని పాలడుగులో బంధువుల ఇంట్లో శుభకార్యానికి హాజరై రాత్రి 10 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై తిరిగి ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో చెట్టు కొమ్మలను రోడ్డుకు అడ్డంగా వేయడంతో ద్విచక్ర వాహనం నెమ్మదించగా.. మాటు వేసిన నిందితులు చీకట్లో రోడ్డుపైకి వచ్చి వారిపై కర్రను విసరడంతో వాహనం నుంచి కిందపడ్డారు. వేటకొడవళ్లతో దాడిచేసి సమీపంలోని పొలాల్లోకి లాక్కెళ్లి వారి వద్ద ఉన్న నగదు, బంగారం దోచుకున్నారు. అర్ధరాత్రి వరకు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారయ్యారు. మరుసటి రోజు ఆమె మేడికొండూరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదైంది. ఈ ఘటన జరిగిన కొద్ది రోజులకు నిందితులు యడ్లపాడు పోలీసు స్టేషన్ పరిధిలో మరో నేరానికి పాల్పడటంతో అక్కడి పోలీసులు వీరిని అరెస్టు చేసి ఆరా తీయగా ఈ నేరానికి కూడా వారే పాల్పడినట్లు నిర్ధారించారు. ఈ మేరకు నలుగురు నిందితులను అరెస్టు చేయగా మరో నిందితుడు దాసరి సుంకన్న పరారీలో ఉన్నారు. బాలుడిపై కేసును ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. నిందితులు లింగమయ్య, ఓబులేశులపై అత్యాచారం నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.66 వేల జరిమానా విధించారు. మరో నిందితుడు రమణకు మూడేళ్ల జైలు శిక్ష రూ.5 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి నీలిమ తీర్పు చెప్పారు.

క్రీడలపై మక్కువ.. సెలవుల్లో శిక్షణ

డోన్ పట్టణం న్యూస్‌టుడే : చిన్నారుల మానసిక శారీరక ఎదుగుదలకు విద్యతో పాటు క్రీడలు ఎంతగానో ఉపయోగపడుతాయి. దీంతో దసరా సెలవులను వృథా చేసుకోకుండా క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకుంటున్నారు ఈ చిన్నారులు. క్రీడా శిక్షణ కేంద్రాలకు పిల్లలను పంపించడంతో చిన్నారుల్లో నాయకత్వ లక్షణాలు, నూతనోత్తేజం, మానసిక పరిపక్వత పెంపొందుతాయని క్రీడా శిక్షకులు చెబుతున్నారు. తమకు ఆసక్తి ఉన్న క్రీడల్లో తర్ఫీదు పొంది జిల్లా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించవచ్చు. భవిష్యత్తులో క్రీడా కోటాలో ఉద్యోగ అవకాశాలను కూడా దక్కించుకునేందుకు అవకాశం ఉంటుంది.

షటిల్ బ్యాడ్మింటన్, టెన్నిస్‌లో తర్ఫీదు

పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్, ఆర్టీసీ కొత్త బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన కోర్టులో సింథటిక్ టెన్నిస్ క్రీడలో కోచ్‌లు ఉచితంగా శిక్షణనిస్తున్నారు. షటిల్ బ్యాడ్మింటన్‌లో 17వ వార్డు కౌన్సిలర్, సీనియర్ క్రీడాకారుడు నాగేంద్ర శిక్షణ ఇస్తున్నారు. ప్రస్తుతం 25 మంది పిల్లలు షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో తర్ఫీదు పొందుతున్నారు. సింథటిక్ టెన్నిస్ కోర్టులో పాతపేట జడ్పీ ఉన్నత పాఠశాల ఒకేషనల్ కోర్సు ఉపాధ్యాయుడు ప్రసాద్‌రావ్‌లు పిల్లలకు క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. ఈ క్రీడలో 10 మంది పిల్లలు శిక్షణ పొందుతున్నారు. రోజు ఉదయం 10 నుంచి 12.30గంటల వరకు, సాయంత్రం 4.30 నుంచి 6గంటల వరకు శిక్షణనిస్తున్నారు. దసరా సెలవులను వృథా చేసుకోకుండా క్రీడల్లో నైపుణ్యాలను పెంచుకోవడానికి వస్తున్నామని చెబుతున్నారు ఈ చిన్నారులు.



ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

షటిల్ బ్యాడ్మింటన్ అంటే ఎంతో ఇష్టం

- ఎం. తైబా



పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. షటిల్ బ్యాడ్మింటన్ అంటే నాకు ఎంతో ఇష్టం. దసరా సెలవుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉంది. క్రీడా కోటలో వ్యాయామ ఉపాధ్యాయిని ఉద్యోగం సాధించాలన్నదే నా లక్ష్యం.

చదువుతో పాటు క్రీడలు అవసరం

- వి. మేఘనాథ్



పట్టణం సమీపంలో ఉన్న ఆదర్శ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాను. దసరా సెలవులలో పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ క్రీడలో ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకుంటున్నాను. ఈ క్రీడలో నైపుణ్యం పెంపొందించుకుని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని రాణించాలని ఉంది.

జాతీయ పోటీల్లో పాల్గొనాలని

- ముబీన్ తబస్సుమ్



పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్నాను. ఆర్టీసీ బస్టాండు వద్ద సింథటిక్ టెన్నిస్ కోర్టులో దసరా సెలవుల్లో శిక్షణ పొందుతున్నాను. ఈ క్రీడపై మెలకువలు పొంది భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటాను.

సారీ నాన్నా.. నిన్నొదిలి వెళుతున్నా

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : తలపై నిప్పుల వర్షం కురుస్తోందా అన్నట్లుగా ఎండ.. చుట్టూ కిక్కిరిసిన జనం.. ఒకటే చెమటలు.. భరించలేని ఉక్కపోత.. ఈ పరిస్థితుల్లో ఎంతోసేపు బతకలేనన్న భావన.. కనీసం ఏడేళ్ల కుమారుడినైనా కాపాడుకోవాలన్న తపనతో ఆ తండ్రి ఒంట్లోని శక్తినంతా కూడదీసుకున్నారు.. కొడుకును రెండు చేతులతో హృదయానికి హత్తుకుని అతికష్టంపై జనం నుంచి బయటపడ్డారు. పసివాడిని ఒడిలో పడుకోబెట్టుకుని ఇదే చివరి చూపు అన్నట్లుగా తల నిమురుతూ.. సారీ నాన్నా.. ఈ ఎండను భరించలేకపోతున్నా.. నావల్ల కావడం లేదు.. ఒంట్లో శక్తిలేదు.. నిన్ను వదిలి వెళ్లిపోతున్నా.. అంటూ నేలకొరిగారు. ఇదీ పాణ్యంకు చెంది వన్నం దినేష్‌కుమార్ (39) విషాదాంతం. ఆదివారం చెన్నై ఎయిర్‌షోలో చోటుచేసుకున్న విషాదంలో మృతి చెందిన వారిలో ఆయనా ఉన్నారు. మంగళవారం పాణ్యంలో ఆయన మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.



దినేష్‌కుమార్ (దాచినచిత్రం)

■ కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాల జిల్లా పాణ్యంకు చెందిన రామచంద్రుడు, రామలక్ష్మమ్మ దంపతులకు కుమారుడు దినేష్‌కుమార్, ఇద్దరు కుమార్తెలు సంతానం. ఆర్టీసీ కండక్టర్‌గా పనిచేస్తున్న రామచంద్రుడు 42 ఏళ్ల వయసులోనే గుండెపోటుతో మృతి చెందారు. తల్లి రామలక్ష్మమ్మ కష్టపడి పిల్లలను చదివించారు. వారి ఉన్నత చదువుల కోసం 20 ఏళ్ల కిందట కుటుంబం చెన్నైకి మారింది. దినేష్‌కుమార్ తమిళనాడులోని మధురై విశ్వవిద్యాలయంలో ఎమ్మెసీ మెరైన్ మైక్రో బయాలజీ, లయోలా విశ్వవిద్యాలయంలో నానో టెక్నాలజీలో పీహెచ్‌డీ చేశారు. దినేష్ కుమార్‌కు మహాలక్ష్మితో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఆయన ట్రేడ్‌మార్క్ సంస్థ ఐపీఆర్ ఐడియేషన్ చెన్నై శాఖకు వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి జయలలిత ప్రభుత్వంలో నానో సాంకేతికతకు సంబంధించిన సలహా కమిటీ సభ్యుడిగా వ్యవహరించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎండ.. ఉక్కపోతతో అస్వస్థత

ఆదివారం ఎయిర్ షోను వీక్షించేందుకు ఏడేళ్ల వయసున్న కుమారుడు సహర్ష్ అద్వైత్‌తో కలిసి ఉదయం 9 గంటలకే వెళ్లారు. మధ్యాహ్నం 2 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, జనం కిక్కిరిసి ఉండటంతో ఉక్కపోతతో దినేష్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కుమారుడితో కలిసి జనంలో నుంచి బయటకు వచ్చిన ఆయన కుమారుడిని ఒడిలో పడుకోబెట్టుకుని అక్కడే కుప్పకూలిపోయారు. సహాయ సిబ్బంది వారిని గుర్తించి వైద్యశాలకు తరలించగా అప్పటికే దినేష్‌కుమార్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని సోమవారం అర్ధరాత్రి పాణ్యం తీసుకొచ్చారు. మంగళవారం అంత్యక్రియలు చేశారు. తల్లి, భార్యాపిల్లల రోదనలు స్థానికులకు కంటతడి పెట్టించాయి.

వైకాపా శ్రేణులు ప్రజలకు అండగా నిలవాలి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలో మంగళవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి, కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైకాపా జిల్లా పార్టీ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలీసులు తెదేపా కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆళ్లగడ్డ, గడివేముల మండలాల ఎస్సైలు తెదేపా కార్యకర్తల కంటే ఎక్కువ రెచ్చిపోతున్నారని ధ్వజమెత్తారు. నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. పార్టీ కోసం పనిచేసే వారికి పదవులు ఇస్తామన్నారు. ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గంగుల బ్రిజేంద్రనాథరెడ్డి, కాటసాని రామిరెడ్డి, శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, భూమా కిశోర్‌రెడ్డి, దార సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

నంద్యాల
• నంద్యాల • నందికొట్కూరు • శ్రీశైలం • పాణ్యం

ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా జాబ్ మేళాలు నిర్వహిస్తున్నట్లు తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ మేళాలో 165 మంది అభ్యర్థులు పాల్గొనగా 54 మంది ఉద్యోగాలుకు అర్హత సాధించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి, జేఈవో సోమశివారెడ్డి, జేడీఎం అన్సర్, కళాశాల ఉపాధి కల్పనాధికారి పార్వతి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరులో మట్టి అక్రమ తవ్వకాలు

పాణ్యం గ్రామీణం, న్యూస్‌టుడే : మండలంలోని ఆలమూరు కొండ సమీపంలో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నట్లు గ్రామస్థులు తెలిపారు. మంగళవారం పొక్లెయిన్లతో మట్టి తవ్వి ట్రాక్టర్లతో తరలించారని చెప్పారు. ఈ విషయమై తహసీల్దారు రవీంద్రనాథ్‌రెడ్డిని వివరణ కోరగా సిబ్బందిని అక్రమ తవ్వకాలపై చర్యలు చేపడతామని చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే: సమస్య: తోటగేరి నుంచి అర్బన్ కాలనీకి వెళ్లే మార్గంలో వీధి దీపం వెలగడం లేదు. **-నాగరాజు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపించి వీధి దీపానికి మరమ్మతులు చేయిస్తాం. **-షాహీర్ బాషా, పురపాలక ఏఈ**

సమస్య: సాయిబాబానగర్‌లోని ఖాళీ ప్రదేశంలో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. **-సుబ్బారెడ్డి, స్థానికుడు**

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో వ్యర్థాలు తొలగిస్తాం. **-జీవన్ కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకుడు**

హోరాహోరీగా సాఫ్ట్‌బాల్ పోటీలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం రామకృష్ణ పీజీ కళాశాల మైదానంలో జరుగుతున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు మంగళవారం మూడోరోజు హోరాహోరీగా సాగాయి. గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని సూపర్ లీగ్ పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 23 రాష్ట్రాల జట్లు పోటీ పడ్డాయన్నారు. కొన్ని జట్లు సూపర్ లీగ్‌కు అర్హత సాధించినట్లు తెలిపారు. ఈనెల 10న ఫైనల్స్ జరుగుతాయని వెల్లడించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఆత్మకూరు డీఎస్పీ రామాంజీనాయక్ సూచించారు. మండలంలోని శివపురం గ్రామంలో మంగళవారం గ్రామసభను నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాల నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆత్మకూరు గ్రామీణ సీఐ సురేశ్‌కుమార్‌రెడ్డి, కొత్తపల్లి ఎస్సై కేశవ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆక్రమణలు.. అభివృద్ధి నిరోధకాలు

☛ ఏడాదిగా బృహత్తర ప్రణాళిక అమలుపై నీలినీడలు
☛ సమస్యల్లో నలుగుతున్న ఆత్మకూరు ప్రజలు

ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : ఆత్మకూరు పురపాలక సంఘంలో నిత్యం ట్రాఫిక్ సమస్యలు వేధిస్తున్నాయి. కర్నూలు- గుంటూరు జాతీయ రహదారి ఆక్రమణలు.. వాహనాల పార్కింగ్‌తో గ్రామీణ రోడ్డులా మారింది. చాలా ఏళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నా పుర పాలకవర్గాలు, పోలీసు అధికారులు నామమాత్రపు చర్యలకే పరిమితం అయ్యారు. పట్టణంలో రహదారుల విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టేందుకు బృహత్తర ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) రూపొందించారు. కౌన్సిల్ ఆమోదం పొంది.. కుడా తీర్మానం చేసినా ఇంత కాలం అమలు దిశగా చర్యలు చేపట్టలేదు. దీంతో పట్టణ ప్రజలు ట్రాఫిక్, ఇతర సమస్యలతో సతమతం అవుతున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ప్రధాన రహదారి వెంట ఆక్రమణల తొలగింపుపై దృష్టిసారించారు. దీన్ని పూర్తిస్థాయిలో చేపట్టి.. బృహత్తర ప్రణాళిక అమలుకు చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ప్రజలు కోరుతున్నారు.


రహదారిని ఆనుకుని ఉన్న వ్యాపార సముదాయం


ఆక్రమణలు తొలిగిస్తున్న పురపాలక కార్మికులు

చేయాల్సింది ఇదీ..

ఆత్మకూరు పట్టణ అభివృద్ధి కోసం ఏడాది కిందట పురపాలక అధికారులు బృహత్తర ప్రణాళిక రూపొందించారు. దానికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. 2040 సంవత్సరం వరకు పట్టణ ప్రజల అవసరాలు తీర్చేలా దీనిని సిద్ధం చేశారు.

☛ ఇందులో భాగంగా ప్రస్తుతం 50 అడుగుల మేర ఉన్న ప్రధాన రహదారిని వంద అడుగుల వెడల్పుతో విస్తరించాలని నిర్ణయించారు. గౌడు కేంద్రం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు, అమ్మ ఆసుపత్రి నుంచి అప్పలరావువీధి, తిక్కయ్యస్వామి దర్గా, గాంధీ పార్కు, పెద్దబజారు, గొల్లపేట, కన్యాకా పరమేశ్వరి ఆలయం, కొత్తపేట మీదుగా నంద్యాల మలుపు వరకు 80 అడుగుల రోడ్డుగా విస్తరించాలని తీర్మానించారు.

☛ పట్టణ సుందరీకరణలో భాగంగా వివిధ ప్రాంతాల్లో పార్కులు ఏర్పాటు చేయాల్సి ఉంది. డివైడర్ల మధ్య మొక్కలు పెంచాలి. నాలుగు రోడ్ల కూడలిలో ఐలాండ్‌ను తీర్చిదిద్ది మొక్కలు పెంచడంతో పాటు హైమాస్ట్ వీధిదీపాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

తొలగింపు.. తాత్కాలికమేనా..?

పురపాలక సంఘంలో ఆక్రమణల తొలగింపునకు అధికారులు గతంలో చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. ప్రధాన రహదారి, వాణిజ్య ప్రాంతాల్లో కాల్వలు, రహదారులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలు, బంకులు, రేకుల షెడ్ల తొలగింపునకు గతంలో కొన్నిసార్లు చర్యలు చేపట్టారు. కొంతమేర తొలగించాక రాజకీయ ఒత్తిళ్లతో వెనకడుగు వేశారు. వెంటనే ఆక్రమణదారులు యథాతథంగా రోడ్లను ఆక్రమించేసి నిర్మాణాలు చేపడుతున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పాటు కాల్వల్లో పూడిక తీసే అవకాశం లేక భారీ వర్షాలు కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాలు మునిగిపోతున్నాయి.

☛ ప్రస్తుత కమిషనర్ రమేష్‌కుమార్ ఆక్రమణలపై దృష్టిసారించారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందడంతో దుకాణాల ఎదురుగా ఏర్పాటు చేసిన రేకులు, బోర్డులను తొలగించాలని వ్యాపారులకు ముందస్తుగా సూచించారు. సెప్టెంబరు 26వ తేదీన కొన్ని ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు తొలగించారు. తాజాగా మంగళవారం ఉదయాన్నే పోలీసుల సాయంతో గౌడు కేంద్రంలో ఆక్రమణల తొలగింపు చేపట్టారు. కొన్ని హోటళ్లు, దుకాణాల ఎదురుగా ఉన్న నేమ్‌బోర్డులు, టేబుళ్లు, ఇనుప గ్రిల్స్‌ను కార్మికులు తొలగించారు.

☛ బృహత్తర ప్రణాళికలో భాగంగా వంద అడుగుల మేర రహదారిని విస్తరించేందుకు వీలుగా నిర్మాణాలకు మార్కింగు వేస్తూ నంద్యాల మలుపు వరకు చేరుకున్నారు. కొంతమంది దుకాణదారులు అధికారులను అడ్డుకున్నారు. తమకు గడువు ఇవ్వకుండా తొలగించడమేంటని, ముందస్తు సమాచారం ఇస్తే తామే తొలగించుకుంటామని వాగ్వాదానికి దిగారు. దీంతో ఈసారైనా పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగిస్తారో.. మరోసారి వాయిదా వేస్తారో నని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పురపాలక సంఘం	ఆత్మకూరు
వార్డులు	24
జనాభా	56,716
నివాస గృహాలు	11,485
పక్కా కాల్వలు	18.2 కి.మీ
కచ్చా కాల్వలు	2.5 కి.మీ
అంతర్గత రహదారులు	46.8 కి.మీ
కచ్చా రోడ్లు	12.4 కి.మీ

ట్రాఫిక్ సమస్య తీవ్రం
– రమేష్‌బాబు, కమిషనరు

పట్టణంలో ప్రధాన రహదారితో పాటు కూడళ్లలో ఆక్రమణలు పెరిగిపోయాయి. వీటివల్ల ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. దుకాణాల ఎదురుగా పార్కింగు స్థలం లేకపోవడంతో వాహనాలను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. దుకాణాల ముందు ఏర్పాటు చేసుకున్న నేమ్‌బోర్డులు, రేకులు, సామగ్రి, ఇతర ఆక్రమణ కట్టడాలు తొలగిస్తున్నాం. మాస్టర్‌ప్లాన్‌లో భాగంగా వంద అడుగుల వరకు మార్కింగు వేస్తున్నాం.

చినుకు.. అన్నదాతకు వణుకు



నంద్యాల జిల్లాలో అకాల వర్షాలు కురువడంతో రైతులు మొక్కజొన్న దిగుబడులను కాపాడుకోవడానికి నానా అవస్థలు పడ్డారు. మహానంది మండలం తమ్మడపల్లె వద్ద రైతులు కల్లాలు, పొలాల్లో మొక్కజొన్నలు ఆరబోసుకున్నారు. మంగళవారం వర్షం కురవడంతో దిగుబడులు తడవకుండా టార్పాలిన్ పట్టలు కప్పారు. రెండు రోజుల కిందట కురిసిన వర్షానికి దిగుబడులు తడిశాయని, వ్యాపారులు తక్కువ ధరకు అడుగుతున్నారని కర్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- న్యూస్‌టుడే, మహానంది

సుంకులాపరమేశ్వరి ఆలయంలో యాగం

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నందికొట్కూరు పట్టణంలోని సుంకులాపరమేశ్వరి ఆలయంలో మహా యాగాన్ని నిర్వహించారు. శరన్నవరాత్రుల సందర్భంగా మంగళవారం యాగం నిర్వహించారు. నంద్యాల పార్లమెంటు నియోజకవర్గ తెదేపా బాధ్యుడు మాండ్ర శివానందరెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భాస్కరరెడ్డి, తెదేపా నాయకులు మాండ్ర సురేంద్రానాథ్‌రెడ్డి, మందాడి రవీంద్రారెడ్డి, రఘురామిరెడ్డి, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

వ్యక్తిపై ఇనుపరాడ్లతో దాడి

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణంలోని చామకాల్వ దగ్గర మంగళవారం రాత్రి వైఎస్సార్ నగర్‌కు చెందిన వెంకటరమణపై కొంతమంది ఇనుపరాడ్లతో దాడి చేశారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించే వెంకటరమణ చామకాల్వ దగ్గర ఉండగా ఆటోలో వచ్చిన కొందరు దాడికి పాల్పడ్డారు. స్థానికులు అడ్డుకోవడంతో దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. గాయపడిన అతన్ని సర్వజన ఆసుపత్రికి తరలించారు.

ఆకతాయికి జైలుశిక్ష

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణం వైఎస్సార్ నగర్‌కు చెందిన వెంకటగిరి అశోక్‌కు ఏడు రోజుల జైలుశిక్ష విధిస్తూ సెకండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి తీర్పునిచ్చారు. అయ్యలూరు- పెద్దకొట్టాల రహదారిపై వెళ్లే మహిళ పట్ల నిందితుడు అసభ్యంగా ప్రవర్తించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. తాలూకా పోలీసులు అశోక్‌పై కేసు నమోదు చేసి మంగళవారం న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి ఆకతాయికి జైలుశిక్ష విధించారు.


మహానంది : కాత్యాయనీదుర్గ అలంకరణలో కామేశ్వరీదేవి అమ్మవారు



నంద్యాల గాంధీచౌక్ : సంజీవనగర్ కోదండ రామాలయంలో మహాలక్ష్మీదేవి అలంకారం


నంద్యాల గాంధీచౌక్ : మెయిన్‌బజార్‌లోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో..

కాత్యాయని.. భక్త వరదాయని


నంద్యాల గాంధీచౌక్ : బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో లక్ష్మీదేవిగా


నంద్యాల గాంధీచౌక్ : జగజ్జనని ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు


నందికొట్కూరు : కన్యకాపరమేశ్వరీ దేవి ఆలయంలో మూలవిరాట్టుకు ధనలక్ష్మి అలంకరణ


కొత్తపల్లి : సంగమేశ్వరంలో మహాగౌరి అలంకరణలో లలితాదేవి


ఆత్మకూరు : మహాగౌరిగా దర్శనమిచ్చిన కన్యకాపరమేశ్వరి

నంద్యాల, నందికొట్కూరు, శ్రీశైలం, పాణ్యం నియోజకవర్గాల వ్యాప్తంగా దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు కనులపండువగా జరుగుతున్నాయి. ఆరోరోజు మంగళవారం శ్రీశైలం, మహానంది క్షేత్రాల్లో అమ్మవార్లు కాత్యాయనీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మిగతా ఆలయాల్లో అమ్మవార్లకు మహాలక్ష్మి, ధనలక్ష్మి, మహాగౌరి తదితర అలంకరణలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- న్యూస్‌టుడే, నంద్యాల క్లస్టరు బృందం

ప్రతి సమస్యను పరిష్కరిస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

గడివేముల, న్యూస్‌టుడే : ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి పేర్కొన్నారు. గడివేముల ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి ఎమ్మెల్యే వినతిపత్రాలు స్వీకరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పొలాల ఆన్‌లైన్ సమస్యలు, భూముల ఆక్రమణపై దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివిధ సమస్యలపై 115 దరఖాస్తులు వచ్చాయి. ఈసందర్భంగా పొదుపు మహిళలకు రూ.24.60 లక్షల బ్యాంకు రుణాలు, రూ.3.50 లక్షలు స్త్రీనిధి రుణాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి రమణమ్మ, తెదేపా మండల కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో వాసుదేవగుప్తా, ఉప తహసీల్దారు రవీంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జయసూర్య పేర్కొన్నారు. పాములపాడులో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మంగళవారం ఆయన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయసూర్య

పాల్గొని మాట్లాడారు. స్థానికులు పలు సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని అధికారులకు ఆయన సూచించారు. మండల అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

మిరప దిగుబడులు నంద్యాలలోనే విక్రయించండి

గడివేముల, న్యూస్‌టుడే : నంద్యాలలో మిరప కొనుగోళ్లు చేపట్టామని, రైతుల తమ దిగుబడులను అక్కడే విక్రయించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. వ్యవసాయశాఖ సిబ్బంది చేసిన ఈ- పంట నమోదును మంగళవారం ఆయన గని గ్రామంలో క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పంట నమోదు సక్రమంగా చేశారా లేదా అని ఆరా తీశారు. ఈసందర్భంగా జేసీ మిరప రైతులతో మాట్లాడుతూ.. విత్తనాలు ఎక్కడి నుంచి తెచ్చారు, దిగుబడులు ఎక్కడ విక్రయిస్తారని అడిగారు. పంటను గుంటూరు మార్కెట్‌కు తరలిస్తున్నట్లు రైతులు చెప్పారు. దీంతో నంద్యాలలోనే పంట దిగుబడులు విక్రయించండని సూచించారు. పొగాకు సాగుపై ఆరా తీశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి మురళీమోహన్‌రావు, ఏడీఏ రాజశేఖర్, మండల వ్యవసాయాధికారి హేమసుందరరెడ్డి, తహసీల్దారు వెంకటరమణ పాల్గొన్నారు.


గని గ్రామంలో పంట నమోదును తనిఖీ చేస్తున్న జేసీ విష్ణుచరణ్

రేషన్ బియ్యం స్వాధీనం


జగదాంబ రైస్‌మిల్లులో తనిఖీలు చేస్తున్న పోలీసు, రెవెన్యూ అధికారులు

వెలుగోడు, న్యూస్‌టుడే: వెలుగోడు జగదాంబ రైస్ మిల్లులో పోలీసు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 20 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకొని మిల్లు యజమాని లాలం రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు. రైస్‌మిల్లులో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వలు ఉన్నాయన్న సమాచారం మేరకు ఎస్సై విష్ణునారాయణ, ఉప తహసీల్దారు చంద్రశేఖర్, ఆర్ఎస్ డీటీ బూర్గన్న, సివిల్ సప్లై డీటీ శ్రీనివాసులు కలిసి తనిఖీలు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు.. తాడాటలో తగ్గరు

☛ అంతర్జాతీయ పోటీలకు నంద్యాల విద్యార్థుల ఎంపిక

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల పట్టణానికి చెందిన విద్యార్థులు తాడాట (జంప్‌రోప్)లో సత్తా చాటుతున్నారు. చిరు ప్రాయంలోనే అద్భుత ప్రతిభ చూపుతున్నారు. సబ్ జూనియర్, జూనియర్ జాతీయస్థాయి పోటీల్లో పలు విజయాలు సాధించారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఇటీవల జరిగిన పోటీల్లో రాణించి థాయిలాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యారు వెంకటసాయికుమార్, త్రిషాకార్తిక్, మహ్మద్ షమీ.

చిచ్చరపిడుగు షమీ



నంద్యాలకు చెందిన పదేళ్ల షేక్ మహ్మద్ షమీ ఐదో తరగతి చదువుతున్నాడు. తండ్రి అమీర్ ప్రోత్సాహంతో రెండేళ్ల నుంచి జంప్‌రోప్‌లో శిక్షణ పొందుతున్నాడు. నంద్యాలలో నిర్వహించిన జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గతనెలలో నాందేడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో రెండో స్థానంలో నిలిచాడు. త్వరలో థాయిలాండ్‌లో జరగనున్న అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

కార్తిక్.. విజయాల కిక్



నంద్యాలకు చెందిన త్రిషాకార్తిక్ ఏడో తరగతి చదువుతున్నాడు. తండ్రి మోహన్ స్ఫూర్తితో జంప్‌రోప్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. నంద్యాలలో జరిగిన అండర్-14 పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. అక్కడా రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. గతనెల 11 నుంచి 14 వరకు నాందేడ్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

వెంకటసాయి.. అన్నింటా ప్రథమమే



నంద్యాల మండలం బిల్లాలాపురం గ్రామానికి చెందిన సి.లక్ష్మి, తిరుమల దంపతుల కుమారుడు సి.వెంకటసాయికుమార్. తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్ననాటి నుంచే జంప్‌రోప్ నేర్చుకున్నాడు. ఈఏడాది జులైలో నంద్యాలలో నిర్వహించిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. అనంతరం నంద్యాలలోనే జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో సైతం ప్రథమ స్థానంలో నిలిచి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. సెప్టెంబరు 11 నుంచి 14 వరకు మహారాష్ట్రలోని నాందేడ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో కూడా ప్రథమ స్థానంలో నిలిచి అంతర్జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు.

మహానందీశునికి రాజంపేట ఎమ్మెల్యే పూజలు

మహానంది, న్యూస్‌టుడే: మహానంది పుణ్యక్షేత్రానికి వైఎస్సార్ జిల్లా రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి దంపతులు దైవదర్శనానికి వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన వారు కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామివార్లకు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. అనంతరం యాగశాలలో ఏఈవో వై.మధు వారిని సత్కరించారు. వేదపండితులు రవిశంకర అవధాని తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

ఆరోగ్యకేంద్రాల్లో పచ్చదనం పెంపొందించండి

గోస్పాడు, న్యూస్‌టుడే : ఆరోగ్య కేంద్రాల పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రోగ్రాం అధికారి


మొక్క నాటుతున్న డా.కాంతారావునాయక్, తదితరులు

డా.కాంతారావునాయక్ సిబ్బందికి సూచించారు. గోస్పాడు ఆరోగ్య కేంద్రం ఆవరణలో మంగళవారం మొక్కలు నాటారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రజలకు ఇళ్ల వద్దే పరీక్షలు నిర్వహించి, మందులు అందించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా.గోపాల్, ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలి

గడివేముల, న్యూస్‌టుడే : భారీ వర్షానికి సోయాచిక్కుడు, మొక్కజొన్న దిగుబడులు నీట మునిగి నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ డిమాండ్ చేశారు. పెసరవాయి గ్రామంలో నీట మునిగి దెబ్బతిన్న దిగుబడులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పంటను కొనుగోలు చేయాలని కోరారు. రబీ సాగుకు ఉచితంగా విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

నిర్భయంగా దరఖాస్తు చేసుకోండి

పాములపాడు, న్యూస్‌టుడే : ఆసక్తి ఉన్న వారు మద్యం దుకాణానికి నిర్భయంగా దరఖాస్తు చేసుకోవాలని నంద్యాల అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రాముడు తెలిపారు. పాములపాడు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల మండలానికి రెండు మద్యం దుకాణాలు కేటాయించామని, వాటిని ఎక్కడైనా ఏర్పాటు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు. గడివేములలో మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

కొత్తపల్లి, న్యూస్‌టుడే: పంట ప్రారంభ దశ నుంచే సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయ పేర్కొన్నారు. మండలంలోని కొక్కెరంచ, దుద్యాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మినుము పంటలో పాటించాల్సిన మెలకువలను రైతులకు వివరించారు. ఏవో మహేష్, వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్టులను క్రమబద్ధీకరించాలి

నంద్యాల పాతపట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వ ఆసుపత్రుల్లో పొరుగు సేవలు, ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న ఫార్మాసిస్టులను క్రమబద్ధీకరించాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చక్రధర్ డిమాండు చేశారు.


సమావేశమైన ఫార్మాసిస్టుల సంఘం సభ్యులు

నంద్యాల పట్టణంలో మంగళవారం ఫార్మాసిస్టుల సంఘం నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శివ, సభ్యులుగా రాజశేఖర్, సుధీర్, సల్మాన్‌రాజ్, రమణ తదితరులను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఫార్మాసిస్టుల సంఘం సభ్యులు భాస్కర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పాం సాగుతో లాభాల పంట

వెలుగోడు, న్యూస్‌టుడే : ఆయిల్‌పాం సాగు చేస్తే రైతులకు లాభాల పంట పండుతుందని ఏవో పవన్‌కుమార్ తెలిపారు. వెలుగోడు మండలంలోని వేల్పనూరులో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయిల్‌పాం సాగు చేసుకుంటే ప్రభుత్వం రాయితీ అందజేస్తుందన్నారు. సర్పంచి సర్దార్‌మియా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

నేడు వీరభద్రస్వామి విగ్రహప్రతిష్ఠ



కొలిమిగుండ్ల న్యూస్‌టుడే : మండలంలోని కోటపాడు గ్రామంలో వీరభద్ర స్వామి విగ్రహప్రతిష్ఠ వేడుకలు బుధవారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామపెద్దలు తెలిపారు. నూతనంగా నిర్మించిన వీర భద్రస్వామి దేవాలయంలో వీరభద్రస్వామి విగ్రహప్రతిష్ఠ ప్రారంభ వేడుకలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఉదయం ప్రాతఃకాల పూజలతో వేడుకలు అర్చకులు అన్నవర్జుల విరూపాక్షశాస్త్రి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి.

కోటపాడులో పూజలందుకున్న వీరభద్రస్వామి

నేడు అన్న క్యాంటీన్ ప్రారంభం

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ పట్టణం లోని పాత బస్టాండు వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌ను బుధవారం ప్రారంభిస్తున్నట్లు కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నామని కమిషనర్ పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) ఆళ్లగడ్డ: 8008 574916 డోన్ పట్టణం: 94408 57790 బనగానపల్లె: 80085 73763

ప్యాపిలి న్యూస్‌టుడే

సమస్య : మండలంలోని గార్లదిన్నె గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న నీటి ట్యాంకు పైప్‌లైన్ దెబ్బతిన డంతో నీళ్లు వృథాగా పోతున్నాయి. - శంకర్ గ్రామస్థుడు

సమాధానం : పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయిస్తాం. – మనోహరమ్మ సర్పంచి

ఘనంగా మొదటి పీఠాధిపతి తిరునక్షత్రం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే : అహోబిలం లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మొదటి పీఠాధిపతి ఆదివన్ శఠగోప యతీంద్ర మహాదేశికన్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అద్దాల మండపంలో ప్రహ్లాదవరదస్వామి, శ్రీదేవి, భూదేవి అమ్మవారిని మొదటి పీఠాధిపతిని కొలువుదీర్చి పంచామృతాలతో అభిషేకించారు. పసుపు, చందనం, కర్పూరం వంటి లేపనాలు సమర్పించి ధూపదీపాలతో మహా మంగళహారతి అందించారు. పీఠాధిపతి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిపై ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ ప్రాకారంలోని దేవతామూర్తుల సన్నిధిల వద్ద కొలువుంచి మంగళాశాసనం చేశారు. సాయంత్రం స్వామి,అమ్మవారికి తిరువీధి ఉత్సవం జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో ఉత్సవం నిర్వహించారు.



స్వామి, అమ్మవారి ఉత్సవం

నత్తనడకన నాడు నేడు పనులు

బనగానపల్లి సంజామల న్యూస్‌టుడే : బనగానపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గత ప్రభుత్వం చేపట్టిన నాడు, నేడు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. పనులు ప్రారంభించి మూడేళ్లు దాటిపోయిన కనీసం యాభై శాతం పనులు కూడా పూర్తికాలేదు. కళాశాల భవనాలకు మరమ్మతులు చేసి విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ పనులను చేపట్టారు. మంచినీటి వసతి, మరుగుదొడ్లు, ఫ్యాన్లు, లైట్లు ఇలా మొత్తం 9 రకాల పనులు చేయాల్సి ఉంది. కానీ పనులు ప్రారంభమైనప్పటి నుంచి సిమెంటు కొరత, నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులను నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం విద్యార్థులు అరకొర వసతుల మధ్యనే చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది.



బనగానపల్లి కళాశాలలో ఆగిపోయిన తరగతి గదుల నిర్మాణం

దాదాపు రూ.1.44కోట్లతో ప్రారంభించారు

బనగానపల్లిలో రూ.54 లక్షలు, కోవెలకుంట్లలో రూ.60 లక్షలు, సంజామలలో రూ.30 లక్షలు మొత్తం కలిపి దాదాపు సుమారు రూ.1.44 కోట్లతో మూడు కళాశాలల్లో మరమ్మతులు చేపట్టడానికి పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటివరకు కేవలం కోవెలకుంట్ల కళాశాలలో మాత్రమే పనులను పూర్తి చేశారు. బనగానపల్లి, సంజామల కళాశాలల్లో మాత్రం పనులు మధ్యలోనే ఆగిపోయాయి. ప్రభుత్వం మారడంతో పనులు ముందుకు సాగడం లేదు. శిథిలావస్థకు చేరిన భవనాల్లో చదువుకోవడానికి విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి నిధులు విడుదల చేసి మౌలిక వసతులను కల్పించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

అధికారుల మధ్య సమన్వయ లోపం

నాడు, నేడు పనులు పూర్తి చేసేందుకు విద్యా కమిటీ సభ్యులు, ప్రిన్సిపల్, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంది. కానీ బనగానపల్లి, సంజామల కళాశాలల్లో పనులు నిలిచిపోవడం, కోవెలకుంట్లలో పనులు పూర్తి చేయడాన్ని గమనిస్తే అధికారులు మధ్య సమన్వయ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. సంబంధిత ఇంజనీరుకు అవుకు, పాణ్యం, కోవెలకుంట్ల, సంజామల కళాశాలలతో పాటు మరికొన్ని కళాశాలలను కేటాయించారు. దీంతో ఆయన బనగానపల్లి, సంజామలలో అరకొరగా అందుబాటులో ఉండటంతో పనులు పూర్తి కాలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నిధుల సమస్యతోనే పూర్తికాలేదు

మదార్, ఏఈ, సర్వశిక్ష అభియాన్

పనులు చాలా వేగంగా చేశాం. నిధులు సరైన సమయానికి విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. కొత్త ప్రభుత్వంలోని ఉన్నతాధికారులకు నివేదికలు పంపిస్తాం. అధికారులు నిధులు విడుదల చేస్తే మిగిలిన పనులను పూర్తి చేయిస్తాం.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పలుకూరు 33కేవీ విద్యుత్ లైనుకు బుధవారం మరమ్మతులు చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ గర్జప్ప తెలిపారు. పలుకూరు గ్రామంలోని వ్యవసాయ బోర్లకు, యనకండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని యనకండ్ల, హుసేనాపురం ఫీడర్లలో త్రీఫేస్ విద్యుత్ బుధవారం ఉదయం 4 నుంచి 9గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉంటుందని రైతులు గమనించి సహకరించాలన్నారు.

బేతంచెర్ల న్యూస్‌టుడే : మండలంలోని సిమెంట్‌నగర్ నుంచి బేతంచెర్లకు వచ్చే లైనులో మరమ్మతుల కారణంగా డోన్, బనగానపల్లె, కర్నూలు రహదారిలోని పాలీష్ పరిశ్రమలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈఈ మధుసూదన్ రెడ్డి, ఏఈ పుల్లయ్య తెలిపారు. అయ్యలచెరువు, సంజీవనగర్, డోన్ రహదారిలోని విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని పాలీష్ పరిశ్రమల యజమానులు సహకరించాలని కోరారు.

రైతుల సంక్షేమమే తెదేపా లక్ష్యం

బేతంచెర్ల న్యూస్‌టుడే : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ఆర్ బీమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోట్ల, ధర్మవరం సుబ్బారెడ్డి

ఎస్ రంగాపురం గ్రామంలో జిల్లా విత్తనాభివృద్ధి శాఖ మేనేజర్ ధనలక్ష్మి, ఏడీ ఆకోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన రాయితీ శనగ విత్తనాలను పంపిణీ కార్యక్రమానికి వీరు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయితీపై పప్పుశనగ విత్తనాలు క్వింటా ధర రూ.9400 కాగా రాయితీతో రూ.2350 మినహాయించి రైతు వాటా రూ.7050 చెల్లించాలని అన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన పెట్టుబడి సాయం రైతులకు రూ.20 వేలు త్వరలోనే మంజూరు చేస్తామని పేర్కొన్నారు. తెదేపా మండల కన్వీనర్ ఉన్నం ఎల్లనాగయ్య, షేక్షావలి చౌదరి, బుగ్గన ప్రసన్నలక్ష్మి, తిరుమలేష్ చౌదరి, జాకీరుల్లాబేగ్, బుగ్గన ప్రభాకర్‌రెడ్డి, రామిరెడ్డి, బీమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న ధర్మవరం

మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామి, మహాలక్ష్మి అమ్మవారిని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల సందర్భంగా స్వామి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

డీఐజీని కలిసిన..

డోన్, న్యూస్‌టుడే : కర్నూలులో డీఐజీ ప్రవీణ్ కుమార్‌ను రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర పదవి దక్కినందుకు డీఐజీ ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెదేపా యువనాయకులు గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిశాలలో ఎమ్మెల్యే పూజలు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ, భర్త భార్గవ్ రామ్



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దంపతులు

నాయుడు, సోదరుడు భూమా విఖ్యాత్‌రెడ్డి మంగళవారం రాత్రి అమ్మవారిశాలలో శరన్నవరాత్రుల పూజల్లో పాల్గొన్నారు. రూ.15లక్షల కరెన్సీతో అలంకరించిన అమ్మవారి అలంకరణను తిలకించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవిశెట్టి హరీష్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

ఆళ్లగడ్డ న్యూస్‌టుడే : పుట్‌బాల్ క్రీడలో జాతీయ స్థాయిలో ఆళ్లగడ్డకు పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ అన్నారు. రాష్ట్రస్థాయి పుట్‌బాల్ పోటీలకు ఎంపికైన ఆళ్లగడ్డ క్రీడాకారులను ఆమె మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్రీడాకారులు విశ్వనాథ్, నరసింహ, ఓబులేసుతో మాట్లాడుతూ త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావాలన్నారు. ఆళ్లగడ్డలో క్రీడల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామన్నారు. క్రీడాకారుల శిక్షకుడు సుబ్బరాయుడుని ఆమె అభినందించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్యాపిలి న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణాల్లో, గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరించి, వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లక్కసాగరం లక్ష్మిరెడ్డి, లక్ష్మీనారాయణయాదవ్, రాజా నారాయణమూర్తి, టి.శ్రీనివాసులు, ఖాజాపీర్, మండలశాఖ అధికారులు పాల్గొన్నారు.

రహదారిపై రాకపోకలకు అవస్థలు



డోన్ పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌లోని వీధుల్లోకి వెళ్లే రహదారిలో భారీ గుంత ఏర్పడింది. వర్షం వస్తే చాలు వర్షపు నీరు నిల్వ ఉండి వాగును తలపిస్తుంది. నడిచి వెళ్లేందుకు, వాహనాల్లో రాకపోకలు సాగించేందుకు చాలా అవస్థలు పడుతున్నామని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే డోన్‌పట్టణం,

మురుగు కాలువ శుభ్రం

స్పందనకు వందనం

బనగానపల్లి న్యూస్‌టుడే : బనగానపల్లి పట్టణంలోని రంగరాజుపేట సమీపంలోని కస్తూర్బా పాఠశాల వీధిలో కాలువలోని మురుగు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ఈనాడులో మురుగు కాలువ ముక్కు మూసుకొని వెళ్లాల్సిందే అనే శీర్షికతో చిత్ర కథనం ప్రచురితమైంది. ఈవో హరిప్రసాద్ స్పందించి సిబ్బందిని పంపించి వెంటనే మురుగు కాలువను శుభ్రం చేయించారు.

మహాలక్ష్మీ అమ్మవారు



ఆళ్లగడ్డ కాళికామాతాలయంలో కనకదుర్గమ్మ పూజల్లో భక్తులు



శిరివెళ్ల: యర్రగుంట్లలో మహాలక్ష్మీదేవి అలంకరణలో అమ్మవారు



ప్యాపిలి: ప్రియా సిమెంట్ కర్మాగారంలో చండీ దేవి అలంకారంలో..



డోన్ : పారాయణం చేస్తున్న దేవిసత్సంగ్ సభ్యులు

నేటితో ముగియనున్న దరఖాస్తుల గడువు

బనగానపల్లి, న్యూస్‌టుడే : ప్రభుత్వం కొత్తగా చేపట్టిన నూతన మద్యం విధానం టెండర్లలో



వివరాలు వెల్లడిస్తున్న డీపీఈవో రవికుమార్

నిర్భయంగా పాల్గొనాలని డీపీఈవో ఎస్.రవికుమార్ పేర్కొన్నారు. ఒక్కో వ్యక్తి రూ.2లక్షలు చెల్లించి ఎన్ని దుకాణాలు కైన టెండర్లు వేసుకోవచ్చని తెలిపారు. టెండర్లు వేయకుండా బెదిరింపులకు గురి చేస్తే తమకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బనగానపల్లి పరిధిలో 12 దుకాణాలు ఉన్నాయని 49 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలో మూడు దుకాణాలకు మూడే దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చిన వెంటనే ఈ నెల 16 నుంచి నాటుసారా స్థావరాలపై దాడులు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ వర్ధనాదేవి, ఎస్.ఐ.కమలాకర్ పాల్గొన్నారు.

సంజామల, న్యూస్‌టుడే : సంజామల మండలంలో నాలుగు మద్యం దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకునే సమయం బుధవారంతో ముగుస్తుందని ఎక్సైజ్‌శాఖ ఎస్సై సందీప్ యాదవ్ తెలిపారు. మంగళవారం సంజామలలో సిబ్బందితో కలిసి నూతన మద్యం విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ పోలీసులు హనుమంతు, లక్ష్మీరెడ్డి, రఫీ పాల్గొన్నారు.

కొలిమిగండ్ల, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం విధానాన్ని ప్రవేశపెట్టిందని ఎక్సైజ్‌శాఖ బనగానపల్లి నియోజకవర్గం సీఐ వర్ధనాదేవి మంగళవారం తెలిపారు. బుధవారం సాయంత్రం 5గంటలలోపు ఆసక్తి గలవారు మద్యం షాపులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. స్థానిక సీఐ రమేశ్‌బాబు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

చాగలమర్రి, న్యూస్‌టుడే : పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిధుల దుర్వినియోగంపై జిల్లా అదనపు వైద్యారోగ్యశాఖ అధికారి శారదాబాయి, డీసీబీఎస్ అధికారి మాధవిలత, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రసన్న లక్ష్మీలు మంగళవారం విచారణ చేపట్టారు. స్థానిక వైద్యశాలకు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022 నుంచి మే 2023వరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 26



వివరాలు వెల్లడిస్తున్న డీపీఈవో రవికుమార్

ప్రసవాలు జరిగాయని, వారికి సంబంధించిన ఆరోగ్య ఆసరా నిధులు వారికి అందలేదు. ఆసుపత్రి అభివృద్ధి మండలికి సంబంధించిన రూ.45 వేలు మండల వైద్యాధికారిణి అంజలి హెచ్‌డీసీ ఛైర్మన్‌కు తెలపకుండా తమ సొంత ఖాతాలో వేసుకున్నారనే ఆరోపణలపై విచారణ చేపట్టామన్నారు. పూర్తి విచారణ చేసి నివేదికలను డీఎంహెచ్‌వోకు అందజేస్తామన్నారు.

కల్లుగీత కార్మికుల రిజర్వేషన్ అమలు చేయాలి

డోన్, న్యూస్‌టుడే : మద్యం దుకాణాల్లో కల్లు గీత వృత్తి కార్మికుల సంఘాలకు 10శాతం రిజ



వినతిపత్రం ఇస్తున్న చేతివృత్తులదారుల సంఘం నాయకులు

ర్వేషన్‌లు అమలు చేయాలని ఏపీ చేతివృత్తుల సమాఖ్య జిల్లా కార్యదర్శి రామ్మోహన్ అన్నారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ మహేశ్వర రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన మద్యం పాలసీలో కల్లుగీత సామాజిక వర్గానికి 10 శాతం దుకాణాలు ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నారాయణ, దళిత హక్కుల పోరాటసమితి నాయకులు ప్రభాకర్, రాఘవేంద్ర, పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి

ప్యాపిలి, న్యూస్‌టుడే : ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్సీని అమలు చేయాలని, పీఆర్సీ అమలయ్యే వరకు 30 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా సీనియర్ నాయకులు అబ్దుల్ లతీఫ్, శాంతిప్రియలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలశాఖ అధ్యక్షుడు కృష్ణానాయక్ అధ్యక్షతన ఆన్‌లైన్‌లో యూటీఎఫ్ నాయకులు మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ప్రజలకు త్వరతగతిన సేవలందించాలి

సంజామల, న్యూస్‌టుడే : ప్రజా సమస్యల పరిష్కారానికి వీఆర్వోలు, గ్రామ సర్వేయర్‌లు సత్వరమే చర్యలు తీసుకోవాలని తహసీల్దారు అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం వీఆర్వోలు, గ్రామ సర్వేయర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో విన్నవించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ కృష్ణయ్య, ఆర్ఐ వెంగళరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించాలి

డోన్, న్యూస్‌టుడే : వాల్మీకి జయంతిని వాల్మీకులంతా ఐక్యంగా కలసికట్టుగా పెద్దఎత్తున నిర్వహించాలని రాష్ట్ర వాల్మీకి ఐక్యత పోరాట కమిటి నాయకులు భాస్కర్‌నాయుడు అన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయం వద్ద వాల్మీకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీన వాల్మీకి జయంతి సందర్భంగా డోన్ పట్టణంలో చేపట్టే కార్యక్రమాలకు వాల్మీకి సోద



ఐక్యత చాటుతున్న వాల్మీకి సంఘం నాయకులు

రులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. వాల్మీకి సంఘం నాయకులు శివరామకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగరాజు, ఆర్మీరామయ్య, కృష్ణమూర్తి, పూలశ్రీను, పోస్టుప్రసాద్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే : బనగానపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు మండలాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు సీడీపీవో ఉమామహేశ్వరమ్మ మంగళవారం తెలిపారు. పూర్తి వివరాలకు బనగానపల్లి ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే : బనగానపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా, కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో ఉమామహేశ్వరి మంగళవారం తెలిపారు.

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో తేజేశ్వరి మంగళవారం కోరారు. ఆసక్తి గల వారు ఈ నెల 21లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు.

క్రీడా దస్తుల పంపిణీ

చాగలమర్రి, న్యూస్‌టుడే : చాగలమర్రి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ సీనియర్ బాలుర పోటీల్లో పాల్గొనే నంద్యాల జిల్లా జట్టు క్రీడాకారులకు పండ్ల వ్యాపారి మహబూబ్‌బాష మంగళవారం దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి మహబూబ్‌బాషా, పీడీ దాదాపీర్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే రేషన్ పంపిణీ చేయాలి

బేతంచెర్ల న్యూస్‌టుడే : అంగన్‌వాడీ సెంటర్లకు పాత పద్ధతిలోనే రేషన్‌ను పంపిణీ చేయా



వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

లని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ సంఘం జిల్లా అధ్యక్షురాలు షేభారాణి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ వర్కర్ల సంఘం మండల అధ్యక్షురాలు నాగలక్ష్మి అధ్యక్షతన స్థానిక సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లకు పాత పద్ధతిలోనే రేషన్ కందిపప్పు, బియ్యం పంపిణీ చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ప్రకాష్ బాబుకు వినతిపత్రం అందజేశారు.

పనిభారం తగ్గించాలి

డోన్, న్యూస్‌టుడే : అంగన్‌వాడీ కార్యకర్తలకు వివిధ యాప్‌ల పేరుతో అధిక పనిభారం మోపుతున్నారని, పనిభారం తగ్గించి ప్రీస్కూల్ అభ్యున్నతికి తోడ్పాటు అందించేలా చూడాలని అంగన్‌వాడీ అసోసియేషన్ నాయకురాళ్లు సులోచన, రహమత్‌బీలు అన్నారు. మంగళవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో పర్యవేక్షకురాళ్లు పరమేశ్వరమ్మ, శోభారాణిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీఐటీయూ నాయకులు నక్కిశ్రీకాంత్, శివరాం తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను కాపాడండి

డోన్ నేరవిభాగం, న్యూస్‌టుడే : వన్యప్రాణులను సంరక్షించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని డోన్ అటవీ అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం డోన్ అటవీశాఖ కార్యాలయంలో వన్యప్రాణుల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వన్యప్రాణులను కాపాడండి, పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ కార్యాలయం నుంచి పాతబస్టాండ్ వరకు సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రవీంద్రనాయక్, ప్యాపిలి ఎఫ్ఎస్ఓ శివశంకర్, ఎఫ్‌బీఓలు విష్ణు, భారతి, శివమ్మ, వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ - ఆటోలు నిరుపయోగం

బేతంచెర్ల న్యూస్‌టుడే: బేతంచెర్ల నగర పంచాయతీలో ఈ-ఆటోలు ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉన్నాయి. స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో భాగంగా నగర పంచాయతీలు, పురపాలక సంఘాలలో ఇంటింటికి వెళ్లి తడి పొడి చెత్తను సేకరించడానికి ఎలక్ట్రికల్ వాహనాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో గత వైకాపా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలకు గతేడాది ఆగస్టు 15న ఈ ఆటోలను కేటాయించింది. ఆరు నెలలుగా ఇవి మూలకు చేరి నిరుపయోగంగా ఉన్నాయి.

ఏడు వాహనాలు మూలకు

బేతంచెర్ల నగర పంచాయతీకి ఆరు ఈ-ఎలక్ట్రికల్ ఆటోలు, నాలుగు నెలల కిందట ఒక సెప్టిక్ ట్యాంకు వచ్చింది. ఏడు వాహనాలకు డ్రైవర్లు లేకపోవడంతో అవి మూలకు చేరాయి. ఈ ఆటోలకు డ్రైవర్లు లేకపోవడంతో గత్యంతరం లేక ట్రాక్టర్లును వినియోగిస్తున్నారు. దీంతో డీజిల్‌కి మున్సిపాలిటీలపై అదనపు భారం పడుతుంది.



మూలకు చేరిన ఆటోలు

పారిశుద్ధ్యం అధ్వానం

పట్టణంలో మొత్తం 20 వార్డులు, 11,252 గృహాలు ఉండగా, రోజూ సుమారు 6 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. సుద్దకనుమ వద్ద ఉన్న చెత్తను డంప్ యార్డుకు తరలిస్తున్నారు. ఈ-ఆటోలకు డ్రైవర్లు లేకపోవడంతో పారిశుద్ధ్యం కుంటు పడుతోంది. సుబ్బారెడ్డినగర్, సుద్దకనుమ, ధరణీ, అల్లాబకాష్ కాలనీ, కొండ ప్రాంతాల్లో, శ్రీనగర్ కాలనీలలో ఈ ఆటోలు ఇంటింటికి వెళ్లి సులువుగా చెత్తను సేకరించడానికి వీలవుతోంది. కానీ ఈ ఆటోలకు డ్రైవర్లు లేక ఆరు నెలలుగా నిరుపయోగంగా ఉన్నాయి. ప్రస్తుతం కేవలం నాలుగు ట్రాక్టర్ల ద్వారానే చెత్తను సేకరిస్తుండటంతో అవి నగర పంచాయతీలో పూర్తి స్థాయిల్లో చెత్తను తరలించలేకపోతున్నాయి. పట్టణంలో డస్ట్‌బిన్‌లు కూడా లేకపోవడంతో ఎక్కడికక్కడ రహదారులు, మార్కెట్లు పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త వేస్తుండటంతో దుర్గంధం వ్యాపిస్తుందని దీంతో నిత్యం అవస్థలు పడుతున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు.

అభివృద్ధిలోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తాం.

హరిప్రసాద్, నగర పంచాయతీ కమిషనర్

ఈ-ఆటోలను పరిశీలించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటాము. ఎత్తు ప్రాంతంలో ఎలక్ట్రికల్ ఆటోలు ఎక్కడం లేదని సమాచారం ఉంది. త్వరలోనే ఈ ఆటోలకు డ్రైవర్లను కూడా నియమించి వినియోగంలోకి తీసుకొస్తాం.

గాలేరునగరి కాల్వలో బాలుడి గల్లంతు

బనగానపల్లి గ్రామీణం న్యూస్‌టుడే : ఆటలాడుకుంటూ ప్రమాదవశాత్తు గాలేరునగరి కాల్వలో పడి మధురుషి అనే బాలుడు గల్లంతు అయిన ఘటన మండల పరిధిలోని యాగంటిపల్లి గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం యాగంటిపల్లి గ్రామానికి చెందిన సుధాకర్, లక్ష్మీదేవిల కుమారుడు మధురుషి గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయ సమీపాన ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు గాలేరునగరి కాల్వలో పడ్డాడు. స్థానికులు గమనించి పోలీసులు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకొని గాలింపు చర్యలు చేపట్టారు.



గల్లంతు అయిన బాలుడు మధురుషి పాతచిత్రం

అవీ..ఇవీ ..అన్నీ

ఉయ్యాలవాడ న్యూస్‌టుడే : సమగ్ర సస్య రక్షణ వల్లే అధిక దిగుబడులు సాధ్యమని కోవెలకుంట్ల ప్రాజెక్టు అధికారిణి ఉమామహేశ్వరమ్మ అన్నారు. అల్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మిరప రైతులతో ఆమె సమావేశం నిర్వహించారు.

రుద్రవరం న్యూస్‌టుడే : మండలంలోని చిన్నకంబలూరు, పేరూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు.

రుద్రవరం, న్యూస్‌టుడే : ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలో మద్యం దుకాణాలకు 17 దరఖాస్తులు అందినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణమూర్తి తెలిపారు.

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పెద్దకొప్పెర్ల గ్రామం శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయం సమీపంలో రోడ్డు పక్కన మురుగు కాల్వలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

బేతంచెర్ల న్యూస్‌టుడే : బనగానపల్లె సబ్ డివిజన్‌లో పీఏయూ ఏఈగా పనిచేస్తున్న మహేష్ బేతంచెర్ల పంచాయతీరాజ్ ఏఈగా బదిలీ అయ్యారు. బేతంచెర్ల మండల ఏఈగా పనిచేస్తున్న గణేష్ కుమార్ ప్రొద్దుటూర్‌కు బదిలీపై వెళ్లారు.

దొర్నిపాడు, న్యూస్‌టుడే : మండలంలోని డబ్ల్యూగోవిందిన్నె గ్రామంలో వెలసిన మూల పెద్దమ్మ తల్లిని ఆళ్లగడ్డ తెదేపా యువ నాయకులు భూమా విఖ్యాత్‌రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు.

చాగలమర్రి న్యూస్‌టుడే : గ్రామాల్లో రైతులు సేంద్రీయ పద్ధతిలో వ్యవసాయం చేస్తే అధిక లాభాలు గడించవచ్చని ఏవో రంగనేతాజీ తెలియజేశారు. మండలంలోని మల్లెవేముల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.

బేతంచెర్ల,న్యూస్‌టుడే : మండలంలోని బుగ్గానిపల్లె తండా గ్రామ సమీపంలో కొండ ప్రాంతంలో సారా బట్టీలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రామానికి చెందిన మాల్యా నాయాక్‌పై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ మాసూం తెలిపారు.